క్లుప్తంగా

నేడు విఠలేశ్వర ఆలయంలో సత్‌సంగ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సత్‌సంగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సత్‌సంగ్ కార్యక్రమానికి వైష్ణవ సదన్ పీఠాధిపతి నారాయణ్ మహరాజ్ పాల్గొని ప్రసగించనున్నట్లు పేర్కొన్నారు. దాదాపుగా రెండు గంటల పాటు సత్‌సంగ్ కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు.

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

ఆదిలాబాద్‌రూరల్: చాలా మంది ఆదివాసీ గర్భిణులు రక్తహీనతతో బాధపడుతున్నారని, వారికి రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని మండలంలోని కేబీ కాలనీకి చెందిన, కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెద్మకి ఆనంద్‌రావ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం డబ్బులి గ్రామానికి చెందిన గర్భిణి మెస్రం రేణుక బాయి రక్తహీనతతో బాధపడుతూ శుక్రవారం రిమ్స్ ఆసుపత్రిలో చేరారు. ఆమెకు రక్తం తక్కువగా ఉందని, వైద్యులు సూచించడంతో ఆమె కుటుంబసభ్యులు తనను సంప్రదించారన్నారు. వెంటనే రక్తదాతను గుర్తించి రక్తదానం చేయడం జరిగిందన్నారు.

ముమ్మరంగా ఉపాధిహామీ పనులు

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఎలాంటి వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీల సంఖ్య పెరిగింది. తాంసి, వడ్డాడి, జామిడి, కప్పర్ల, పొన్నారి, పాలోదితో పాటు భీంపూర్ మండలంలోని కరంజి(టి), బెల్సరీరాంపూర్, ధనోర, నిపాని, పిప్పల్‌కోటి గ్రామాల్లో చెరువుల్లో కందకాల పనులు చేపడుతున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టీఏలు పనులను పర్యవేక్షిస్తున్నారు.

కంచె నిర్మించండి



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇంటర్ ప్రవేశాల ప్రక్రియ ఆన్‌లైన్‌లో చేపట్టాలి

ఖానాపూర్: విద్యార్థులకు సులువుగా ఉండేలా ప్రభుత్వం ఇంటర్ ప్రవేశాల ప్రక్రియను ఆన్‌లైన్‌లో చేపట్టాలని విభాగ్ ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ చంద్రగిరి శివ అన్నారు. శనివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకు లోబడి ప్రవేశాలు చేయాలని కోరారు. కార్పొరేట్ పేరిట విద్యను వ్యాపారం చేస్తున్న యాజమాన్యాలపై ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

డంపింగ్‌యార్డు పరిశీలన



వైకుంఠధామం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఖానాపూర్: మండలంలోని బీర్నంది, ఎర్వచింతల్ గ్రామాల్లో శనివారం నిర్మల్ డీఎల్‌పీవో రమేశ్ పర్యటించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో డంపింగ్‌యార్డు, సెగ్రిగేషన్‌షెడ్డు, క్రీడాప్రాంగణాలు, వైకుంఠదామం, పల్లె పకృతివనాలను పరిశీలించారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంతకముందు ఎంపీడీవో సునీత ఆయా గ్రామాల్లో పర్యటించారు. వెంట పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ



సరుకులు పంపిణీ చేస్తున్న సీడీపీవో

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్, సుభాష్‌నగర్ తదితర కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీవో సరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా చిన్నారుల హాజరు వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం పలువురికి పోషకాహార సరుకులు అందజేశారు. టీచర్ సరోజ, సిబ్బంది ఉన్నారు.

త్వరలో స్కూల్ యూనిఫాంలు

- 10వేల మంది విద్యార్థులు.. ఐదు కేంద్రాలు
- ఆదిలాబాద్ మున్సిపాల్టీకి చేరిన వస్త్రం
- రేపటి నుంచి ఎస్‌హెచ్‌జీలకు అందజేత



మున్సిపల్ కార్యాలయంలోని భద్రపరిచిన వస్త్రం

కైలాస్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ప్రభుత్వమే ఉచితంగా స్కూల్ యూనిఫాం అందజేస్తోంది. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రెండు జతలను అందించనుండగా.. వీటిని కుట్టించే బాధ్యతలను గతంలో టెండర్ల ద్వారా టైలర్స్‌కు అప్పగించేవారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉపాధిని కల్పించాలనే ఉద్దేశంతో ఈ యూనిఫాంలను కుట్టించే బాధ్యతను ఈసారి వారికే కట్టబెట్టింది. దీంతో ఆదిలాబాద్ పట్టణంలోని పాఠశాలల విద్యార్థులకు అవసరమైన యూనిఫాంలు కుట్టించే బాధ్యతను మెప్మా పర్యవేక్షిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. యూనిఫాంలకు అవసరమైన వస్త్రం శనివారం జిల్లా కేంద్రానికి చేరగా.. మున్సిపల్ కార్యాలయంలో భద్రపరిచారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఆదివారం నుంచి ఎస్‌హెచ్‌జీల వారీగా వస్త్రాన్ని అందజేయనున్నారు.

10,766 మంది విద్యార్థులకు..

ఆదిలాబాద్ మున్సిపాల్ పరిధిలో ప్రాథమిక, ప్రాథమికొన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 62 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటితో పాటు మరో మూడు మోడల్ స్కూల్స్ ఉన్నాయి. వీటిల్లో 10,766 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో బాలికలు 4643 మంది ఉండగా.. 5923 మంది బాలురున్నారు. ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున మొత్తం 21,532 యూనిఫాంలను కుట్టాల్సి ఉంటుంది. ఇందు కోసం పట్టణ పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లో కుట్టు శిక్షణ నైపుణ్యం కలిగిన వంద మందికి పైగా మహిళలను ఎంపిక చేశారు. వారి పేరు, సంఘం, బ్యాంక్ అకౌంట్ వంటి సమగ్ర వివరాలను సేకరించారు. ఒక్కో కేంద్రంలో 25 మందికి పైగా సభ్యులు యూనిఫాంలు కుట్టేలా మహాలక్ష్మివాడలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయగా.. ఖానాపూర్, కేఆర్‌కే కాలనీ, సుభాష్ నగర్‌ల్లో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం ఐదు కేంద్రాల్లో వంద మందికిపైగా సభ్యులు యూనిఫాంలను కుట్టనున్నారు.

చేరిన వస్త్రం..

విద్యార్థుల యూనిఫాంలకు అవసరమైన వస్త్రం శనివారం ఆదిలాబాద్ పట్టణానికి చేరగా.. దాన్ని మున్సిపల్ కార్యాలయంలోని భద్రపరిచారు. ఆదివారం కేంద్రాల వారీగా వస్త్రాన్ని స్వయం సహాయక సంఘాలకు అందజేయనున్నారు. ఆదివారం సాయంత్రం లేక సోమవారం నుంచి ఈ ఐదు కేంద్రాల్లోనూ యూనిఫాంలను కుట్టే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇప్పటికే విద్యార్థుల సంఖ్యకనుగుణంగా బాల, బాలికల వారీగా కొలతలు తీసుకుని ఉన్నందున యూనిఫాంలను కుట్టే కార్యక్రమ వేగంగా సాగేలా చర్యలు చేపడుతున్నారు. జూన్ 10 నాటికి విద్యార్థులకు అవసరమైన యూనిఫాంను విద్యార్థులకు అందించేలా కార్యచరణను సిద్ధం చేశారు. కుట్టే ప్రక్రియను పరిశీలించేందుకోసం మెప్మా రిసోర్సుపర్సన్లు, సీఓలను పర్యవేక్షకులుగా నియమించారు. ఒక్కో జతకు కుట్టుకూలి కింద రూ.50 చెల్లించనున్నారు. ప్రస్తుత మున్న ధరల ప్రకారంగా ఇవి ఏమాత్రం సరిపోవని పెరిగిన ధరలకనుగుణంగా కుట్టుకూలీ పెంచాలని ఎస్‌హెచ్‌జీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశముందని మెప్మా డీఎంసీ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో ఐదు కేంద్రాల్లో యూనిఫాంలను కుట్టే ప్రక్రియను ప్రారంభించనున్నట్లుగా వెల్లడించారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



భద్రకాళీ అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. వరంగల్ జిల్లా కేంద్రంలో శనివారం ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి, వాటి అమలులో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పాలన సాగుతుందని ఆరోపించారు. అదేవిధంగా పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. పట్టభద్రులంతా అవగాహనతో సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలని కోరారు. అంతకుముందు భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న పాయల్ శరత్

ఆదిలాబాద్: క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్న జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన సాయి అనే యువకునికి పాయల్ ఫౌండేషన్ అండగా నిలిచింది. బాధితుడికి చికిత్సకు ఫౌండేషన్ తరపున చైర్మన్ పాయల్ శరత్ కుమార్ శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో వారి మిత్రులకు రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్‌కు చెందిన కాప్సే సాయితేజ్ అనే యువకుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ప్రస్తుతం హైదరాబాదులోని ఓమెఘా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. ఆపరేషన్ కోసం రూ.7లక్షలు అవసరమవుతాయని వైద్యులు పేర్కొన్నారు. తల్లి నిరుపేద కావడంతో బాధితుడికి వైద్యం ఇబ్బందికరంగా మారింది. ఈ పరిస్థితుల్లో తమ స్నేహితుడిని బతికించుకోవాలనే ఉద్దేశంతో సాయితేజ్ స్నేహితులు ఆదిలాబాద్ పట్టణంలోని తిరుమల ఫిల్లింగ్ స్టేషన్ యజమాని ముడుపు మౌనిష్ రెడ్డిని ఆశ్రయించారు. అందుకు స్పందించిన ఆయన బాధితుడి చికిత్స నిమిత్తం రూ.40వేల నగదు అప్పటికప్పుడు అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. దీంతో బాధితుడు స్నేహితులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

సన్నబియ్యం కొనలేం



సన్నబియ్యం బస్తాలు

- క్వింటాలుకు రూ. 7 వేలు పలుకుతున్న ధర
- కొనలేకపోతున్న పేద, మధ్య తరగతి ప్రజలు

బోథ్: సన్నబియ్యం ధరలు అమాంతం పెరిగిపోయాయి. బహిరంగ మార్కెట్లో సన్న బియ్యం ధరలు అందనంత దూరంలో ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాలుకు రూ. 7 వేలు పలుకుతోంది. గత ఏడాది కంటే ఈసారి క్వింటాలుకు రూ. వెయ్యి నుంచి రూ. 2000 వరకు పెంచి అమ్ముతున్నారు. ఈ ధరలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తుంది. జిల్లాలో వరి సాగు తక్కువగా ఉంటుంది. నిజామాబాద్, కామారెడ్డితో పాటు పలు జిల్లాల నుంచి ఆదిలాబాద్ జిల్లాకు బియ్యం సరఫరా అవుతుంది. ఈ ఏడాది వానాకాలం సన్న రకం ధాన్యం ఆశించిన దిగుబడి రాకపోవడంతో సన్న బియ్యం ధరలు పెరిగిపోయాయి. దళారులు సన్నరకం బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు పంపించడం, గోదాంలో నిల్వ ఉంచి కొరత సృష్టించడంతో సన్నబియ్యం ధరలు 20 శాతం పెరిగిపోయాయి.

సామాన్యులపై భారం..

పెరిగిన సన్న బియ్యం ధరలు మాత్రం సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సన్న బియ్యం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గత ఏడాది జై శ్రీరాం రకం పాత బియ్యం రూ.5 వేలు ఉంటే ఈఏడాది రూ.6,500 వరకు పలుకుతున్నాయి. దీనితో సన్న బియ్యం పేరు చెప్తేనే సామాన్యులు, మధ్యతరగతి వారు వణికిపోతే పరిస్థితి నెలకొంది. మరోవైపు కొత్త బియ్యం, స్టీం రైస్, నూకల ధరలు పెరిగిపోతుండటంతో రోజువారీ కూలీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ధరలు తగ్గించాలి



సన్న బియ్యం ధరలను తగ్గించాలి. గతంలో రూ. 5 వేలకు వచ్చే క్వింటాలు సన్న బియ్యం, ప్రస్తుతం రూ.7 వేలకు పైగానే ఉంది. దాదాపు రెండు వేలు పెరిగింది. సన్నబియ్యం కొనాలంటే భయమేస్తోంది. ప్రభుత్వం సన్నబియ్యం ధరలు తగ్గేలా చర్యలు తీసుకోవాలి. పేద, మధ్యతరగతి ప్రజలకు ధర భారంగా మారుతోంది.

– అవునూరి నవీన్ కుమార్, బోథ్

సన్నబియ్యం ధరలు ఇలా..

బియ్యం రకం	గత ఏడాది(క్వింటాలుకు)	ప్రస్తుతం(క్వింటాలుకు)
జైశ్రీరాం(పాతవి)	రూ.5వేల నుంచి రూ.6 వేలు	రూ.6500 నుంచి రూ.7500
జైశ్రీరాం(కొత్తవి)	రూ.4500 నుంచి రూ. 5 వేలు	రూ. 5,500 నుంచి రూ.5900
బీపీటీ(పాతవి)	రూ.4600 నుంచి రూ.5 వేలు	రూ. 5400 నుంచి రూ.4900
బీపీటీ(కొత్తవి)	రూ.4 వేల నుంచి రూ.4200	రూ.5500 నుంచి రూ. 6200
స్టీం రైస్	రూ. 5 వేల నుంచి రూ. 5200	రూ. 5500 నుంచి రూ.6200

కొనసాగుతున్న జొన్న కొనుగోళ్లు



మార్కెట్‌యార్డులో జొన్నల కొనుగోళ్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో జొన్నల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్ పరిధిలోని ఇచ్చోడ, సిరికొండ, గుడిహత్నూర్ మండలాల్లో 2119 మంది రైతుల నుంచి దాదాపుగా 40 వేల క్వింటాళ్ల జొన్నలు కొనుగోళ్లు చేసినట్లు సెంటర్ ఇన్‌చార్జి రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. ఈనెల 29 బుధవారం నుంచి కొనుగోళ్లను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కళలపై అభిరుచి పెంచుకోవాలి



నృత్యం చేస్తున్న దృశ్యం



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: చిన్నారులు చదువుతోపాటు కళలపై అభిరుచి పెంపొందించుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో శనివారం నిర్వహించిన అవంతి కూచిపూడి నృత్య శిబిరం ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎంతోమంది ప్రతిభగల కళాకారులు ఉన్నారని, వారిని ప్రోత్సహిస్తే గొప్ప కళాకారులుగా రాణిస్తారన్నారు. చిన్నారుల్లో సైతం ఎన్నో విషయాల పట్ల అభిరుచులు, ఆసక్తులు ఉంటాయన్నారు. తల్లిదండ్రులు వారి ఆసక్తులకు అనుగుణంగా ప్రోత్సహించేందుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఆకుల ప్రవీణ్, కృష్ణయాదవ్, నిర్వాహకులు సంతోష్, అవంతిక, శివ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

ఎదులాపురం: యువత ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక మహాలక్ష్మి వాడలో హనుమాన్ దీక్షదారుల ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకి శోభాయాత్రలో పాల్గొన్నారు. హనుమాన్ ఉత్సవమూర్తికి పూజలు చేసి పల్లకి ఊరేగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని సూచించారు.

అధ్వాన రహదారిపై అవస్థలు



బజార్‌హత్నూర్ మండల కేంద్రం నుంచి జాతర్ల వైపు 52 గ్రామాలకు వెళ్లే ఆర్ అండ్‌బీ రెండు వరసల రహదారిలో నిర్మించిన వంతెనకు ఇరువైపులా రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో చిన్న వర్షానికే బురదమయంగా మారుతుంది. సంబంధిత అధికారులు స్పందించి తొలకరి వర్షాలకంటే ముందే రోడ్డు పనులు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు. – బజార్‌హత్నూర్

నకిలీ విత్తనాలతో మోసపోవద్దు



సూచనలు చేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిరికొండ: రైతులు నకిలీ విత్తనాల బారిన పడి మోసపోవద్దని వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, దీపక్‌లు అన్నారు. శనివారం మండలంలోని రాయిగూడ, లచ్చిపూర్, నారాయణ్‌పూర్ గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు తమను సంప్రదించాలని, దళారులను నమ్మి నకిలీ విత్తనాల బారిన పడి మోసపోవద్దన్నారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

కైలాస్‌నగర్: విత్తన కొనుగోలు సమయంలో నకిలీ విత్తనాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. విత్తన ప్యాకెట్లపై హాల్‌మార్క్ చూసి ధ్రువీకరించబడిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే వ్యవసాయాధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నకిలీ విత్తనాల పట్ల జాగ్రత్త వహించాలి

బోథ్: నకిలీ విత్తనాల పట్ల రైతుల జాగ్రత్తగా ఉండాలని వ్యవసాయ విస్తరణ అధికారి కొత్తూరు శ్యామ్ తెలిపారు. శనివారం మండలంలోని అందరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. బయట వ్యక్తులు ఎవరైనా విత్తనాలు అమ్మితే అలాంటి వారి సమాచారం వ్యవసాయ, పోలీస్ అధికారులకు అందించాలన్నారు. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు సమయంలో రశీదు తప్పని సరిగా పొందాలన్నారు. రశీదు పైన రైతు పేరు, గ్రామం, విత్తనం పేరు, లాట్ నెంబర్ కొనుగోలు చేసిన ప్యాకెట్‌ల సంఖ్య, రైతు సంతకం, డీలర్ సంతకం తప్పనిసరిగా ఉండాలని అన్నారు. పంటల సాగులో పాటించాల్సిన మెళకువలు వివరించారు.

పరామర్శ



పరామర్శిస్తున్న జోగు రామన్న

జైనథ్: మండలంలోని గిమ్మ గ్రామంలో ఇటీవల పిడుగుపాటుతో మృతి చెందిన కిరణ్, మంద సంటన్న కుటుంబాలతో పాటు ప్రమాదంలో గాయపడిన పలువురిని మాజీ ఎమ్మెల్యే జోగురామన్న పరామర్శించారు. శనివారం ఆయన నాయకులతో కలిసి గిమ్మా గ్రామానికి వెళ్లారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పిడుగుపాటుతో మృతి చెందిన మృతుల కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం అందించి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రమాదానికి గురైన భోజన్న, రాములు, కోరెల్లి టిల్లుకు మెరుగైన వైద్యం కోసం ఆర్థిక సాయం చేస్తామన్నారు. ఆయన వెంట నాయకులు లింగారెడ్డి, గోవర్ధన్, ఊషన్న, పురుషోత్తం ఉన్నారు.

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన కొరింశెట్టి రాములు ఇటీవల మృతి చెందాడు. అలాగే ధరందాస్, శంకర్‌ల తల్లి హీరవ్వ మరణించిన విషయాన్ని తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ శనివారం వారి ఇంటికి వెళ్లి కుంటుంబసభ్యులను పరామర్శించాడు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బోథ్ అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ప్రెసిడెంట్ బద్దం పోతారెడ్డి, రాములు, నాయిడి రవి, గంధం నవీన్, కుంట శంకర్, గాదె రవి, సుభాష్, జనార్దన్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణిందర్

ఇచ్చోడ: పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని ఆదిలాబాద్ డీఎల్‌పీవో ఫణిందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోస్టాఫీసు వద్ద చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించి స్థానిక పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తుగా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. చెత్తాచెదారం తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.